ప్రజాశక్తి
శనివారం 5, నవంబర్ 2022
5
అనంతపురం



ఇళ్ల పట్టాల పంపిణీకి భూసేకరణ చేపట్టండి

అనంతపురం : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంపై కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ లు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 90 రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ద్వారా అర్హులుగా గుర్తింపబడినప్పటికీ పట్టా పొందని దాదాపు 8000 మంది కోసం భూసేకరణ వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. అనంతపురం నగర పరిధిలో కోర్టు కేసులను వెంటనే పరిష్కరించేందుకు అవకాశాలు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, జె.రవీంద్ర, మునిసిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి, అన్ని మండలాల తహశీల్దార్లు, పట్టణాల మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ముఖద్వారం

ఎస్కేయూలో రివర్సు 'టెండరింగ్'

ఎక్కువ కోడ్ చేసిన వారికే టెండరు ఇదేమి మతలబో..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టిన పని రివర్సు టెండరింగు..ఎక్కువ ధరకు పనులకు అప్పగించకుండా ప్రభుత్వానికి మిగులు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ పనిని చేపట్టింది. ఇప్పటికీ టెండరు పిలిచే సమయంలో వివిధ దశల్లో వడపోత చేపడుతోంది. అయితే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మాత్రం ప్రభుత్వ విధానానికి భిన్నంగా వ్యవహరించడం గమనార్హం. టెండరులో తక్కువ కోడ్ చేసిన వారికి కాదని ఎక్కువకు కోడ్ చేసిన వారికి టెండరును కట్టబెట్టడం చర్చనీయాంశం అవుతోంది. ఇదేమి మతలబు అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.27 లక్షలు అదనపు భారం

పరీక్షల నిర్వహణకు సంబంధించి ఒఎంఆర్ షీట్లు, జవాబుపత్రాల బుక్‌లెట్స్ తయారీ, ఇతర జాబ్ వర్కు కోసం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏడు భాగాలుగా విభజించి టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండరు పని రెండు కోట్ల లోపు ఉంటే ఐదు కోట్ల టర్నోవర్ ఉన్న వారు మాత్రమే పాల్గొనాలన్న నిబంధనను పెట్టింది. అది పెట్టిన తరువాత కూడా కొన్ని సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో ప్రధానంగా రెండు సంస్థలు పోటీపడగా ఎల్1 వచ్చిన సంస్థకు కాకుండా ఎల్ 2కు పనులను అప్పగించారు. మొత్తం రూ.1.40 కోట్ల విలువైన పనికి పిలిచిన ఈ టెండర్లలో ఈ రకంగా అధిక ధరకు కోడ్ చేసిన వారికివ్వడం మూలంగా విశ్వవిద్యాలయంపై రూ.27 లక్షల వరకు అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోటీపడిన రెండు సంస్థలు వేసిన టెండరు ధరలు చూస్తే ఇట్టే అర్థమవుతుంది. హైటెక్ ప్రింట్ సిస్టమ్ లిమిటెడ్ అనే సంస్థ, వివిఎస్.హైటెక్ సెక్యూరిటీ ఫార్మ్స్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో విభాగాల వారీగా చూస్తే హైటెక్ ప్రింట్ సంస్థ కంటే వివిఎస్ హైటెక్ సెక్యూరిటీ ఫార్మ్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ అన్నింటిలోనూ తక్కువ ధరనే కోడ్ చేసింది. ఇవి వరుసగా ఈ విధంగా ఉన్నాయి. రూ.10.58, 10.45,10,11.95, 3.95, 2.89, 1.89 ఉన్నాయి. ఇక హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్ కోడ్ చేసిన విలువలు ఈ విధంగా ఉన్నాయి వరుసగా రూ.12.69, 12.15, 12.96, 14.04, 4.95,3.33, 2.43 ఉన్నాయి. అన్నింటిలోనూ ఎల్1 సంస్థగా వివిఎస్ హైటెక్ నిలుస్తుంది. కాని అలా కాదని హైటెక్ సంస్థకు పనులను శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అప్పగించింది. ఈ రకంగా అప్పగించడం మూలంగా రూ.27 లక్షలు అదనపు భారం పడనుంది.

ఆర్థిక ఇబ్బందులున్నా

ఒకవైపు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆర్థిక ఇబ్బందులతో నడుస్తోంది. అనేక పనులు పెండింగులో ఉన్నాయి. ఇటువంటి సమయంలో ఉన్న ఆర్థిక వనరులను పొదుపుగా వాడాల్సిందిపోయి అదనపు భారం పడే విధంగా వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది. తక్కువ ధరకే చేస్తామని ముందుకొచ్చిన వారిని కూడా కాదని అధిక ధరలకు కోడ్ చేసిన వారికి పనులు అప్పగించడం వెనుక మతలబు ఏమిటన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బియ్యంతో సరిపెట్టుకోవాల్సిందేనా..!

రోజు రోజుకూ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొనుగోలు చేయలేరనే ఉద్దేశంతో పేద ప్రజల కోసం ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థను తీసుకొచ్చాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు బియ్యంతో పాటు చక్కెర, మంచినూనె, కందిబేడలు, గోదుమలు, గోమపిండి సబ్సిడీతో అందించేవారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రస్తుతం ఇస్తున్న వాటితోపాటు మరిన్ని సరుకులను కలిపి ఒక సంచిలో రేషన్‌కార్డు ఉన్న ప్రతి గడపకూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చాక గతంలో ఇస్తున్న సరుకులను సైతం ఇవ్వడంలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బియ్యంతో పాటు అప్పుడప్పుడు అరకిలో చక్కెర మాత్రమే అందిస్తుండడం గమనార్హం.

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు
నీరు గారుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ
పేదలకు అందని పౌష్టికాహారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో 62 చౌక దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాలకు అనుసందానంగా 37,564 రేషన్ కార్డులు ఉన్నాయి. సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయడం కోసం 22 మొబైల్ వాహనాలను కేటాయించారు. ప్రతి వాహనానికి ఆపరేటర్, అసిస్టెంట్, వాలంటీర్, వీఆర్‌వో లను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. ప్రతి గడపకూ వెళ్లి సరుకులను అందించాలని ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చింది. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఇప్పటికీ సరుకులను రేషన్ దుకాణాల్లోనే డీలర్లు అందిస్తున్నారు.

బియ్యంతోనే సరిపెడుతున్న వైనం..

ప్రస్తుత ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం పంపిణీ చేస్తూ సరిపెడుతోంది. బియ్యం ఒక్కటే తీసుకుని బతకమని చెబుతున్నట్లు అనిపిస్తోంది. మిగిలిన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక పేదలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా పండగ పూట కూడా పేదలకు పట్టెడు పప్పన్నం దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ నెల కూడా పేదలకు కందిపప్పు, చక్కెర వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీపావళికే వీటిని ప్రభుత్వం అందించిన పాపాన పోలేదు. ఇక నవంబర్ నెలలోనూ ఇవి పేదలకు అందే పరిస్థితి లేదని తెలుస్తోంది. టిడిపి ప్రభుత్వం సంక్రాంతికి, దీపావళికి, ఇతర మైనారిటీల పండుగలకు కానుక, తోఫాల పేరుతో సరుకులు పంపిణీ చేసేది. ఇలా చేయలేని పరిస్థితిలో అదనపు కోటా అయినా ఇవ్వాల్సి ఉంది. అరకిలో చక్కెర, కిలో కందిపప్పు అదనంగా ఇవ్వాలి. అదనం కాదు గదా కనీసం నెలనెలా అందించే సరుకులు కూడా ఇవ్వడం లేదు.



హిందూపురం పట్టణంలో మూలనపడ్డ బియ్యం సరఫరా చేసే వాహనం

ఆకాశాన్నంటుతున్న ధరలు..

బయట దుకాణాల్లో ధరలు విపరీతంగా మండిపోతున్నాయి. కిలో కందిపప్పు ధర.130 నుంచి రూ.150 పలుకుతోంది. అదే చౌకదుకాణంలో అయితే ఇది రూ.60కే దొరికేది. పేదలకు కాస్తయినా పౌష్టికాహారం దొరికేది. ఇదే విధంగా మిగిలిన వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పామాయిల్ కొనాలన్నా రూ.145 వరకు వెచ్చించాలి. పేదలను ఈ ధరల భారం నుంచి ఆదుకోవాలంటే చౌకదుకాణాలను బలోపేతం చేసి వాటి ద్వారా సరుకులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్. ఇన్‌సెట్‌లో రుద్రప్ప (ఫైల్ ఫొటో)

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు చెట్ల రుద్రప్ప మృతి

ప్రజాశక్తి-అనంతపురం

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు చెట్ల రుద్రప్ప (105) శుక్రవారం నాడు తన స్వగ్రామమైన శెట్టూరులో మృతి చెందారు. వందేళ్లు దాటినా హుషారుగా తిరిగే రుద్రప్ప నాలుగు రోజుల క్రితం కిందపడి అనారోగ్యానికి గురయ్యారు. గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. స్వాతంత్ర్యోద్యమం నుంచి ప్రజాపోరాటాల్లోకి వచ్చారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను నెల రోజుల పాటు జైల్లో పెట్టారు. ఐదుకల్లు సదాశివన్ నాయకత్వంలో కళ్యాణదుర్గం తాలుకా నాయకులు ఎర్రిస్వామి, పిఎస్.శర్మ నేతృత్వంలో 1952 సంవత్సరంలో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. అనంతపురానికి నదీ జలాల కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో బంజరు భూములను పేదలకు పంచాలని జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. అక్రమంగా కర్నాటకకు తరలివెళ్తున్న ఆహార ధాన్యాలను అడ్డుకుని పేదలకు పంచే కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఈ సమయంలో ఆయనపై హత్యాయత్నం సైతం జరిగింది. 1981లో గ్రామ సర్పంచి గానూ ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఇలా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు రుద్రప్ప నిలబడ్డారు. ఆయన కుమారుడు చెట్ల ఈశ్వరయ్య కూడా తండ్రి బాటలోనే పయనిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన పనిచేస్తున్నారు.

సిపిఎం నివాళి

శెట్టూరు గ్రామంలోనున్న చెట్ల రుద్రప్ప భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సందర్శించి నివాళుల ర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చెట్ల రుద్రప్ప జీవితం నేటి తరానికి ఆదర్శమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్, నాయకులు రంగనాథ్, సురేష్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఇన్‌ఛార్జి డిఇఒగా వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న డిఇఒ కె.శామ్యూల్‌ను కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప ఆర్జేడీగా పనిచేస్తున్న వెంకటకృష్ణారెడ్డికి ఇన్‌ఛార్జిగా నియమించారు. అనంతరం కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత వెంకటకృష్ణారెడ్డికి బదిలీ డీఈవో శామ్యూల్, సమగ్ర శిక్ష ఎపిసి తిలక్ విద్యాసాగర్, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, గుత్తి డిప్యూటీ డిఇఒ శంకరప్రసాద్, ఎడి కృష్ణయ్య, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఇఒ మాట్లాడుతూ ప్రస్తుతం తాను ఇన్‌ఛార్జి డిఇఒగా వచ్చానని, త్వరలోనే త్వరలోనే రెగ్యులర్ డిఇఒ వస్తారని తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు దరఖాస్తులను నిబంధనల ప్రకారంగానే పరిశీలించి పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

డీఈవో బదిలీ ఉత్తర్వులను రద్దుచేయాలి

డీఆర్వో గాయత్రిదేవికి యుటిఎఫ్, ఎస్‌టియు నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ బదిలీ ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు డిఆర్ఒ గాయత్రిదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'నకిలీ ఓట్ల నమోదుకు సహకరించలేదని డిఇఒ ఆకస్మిక బదిలీ' అనే వార్త చూడగానే జిల్లా ఉపాధ్యాయ లోకం ఆశ్చర్యపోయిందన్నారు. అధికారులపై కక్షగట్టి బదిలీ చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, రాష్ట్రోపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. డీఈవో శామ్యూల్ మూడేళ్లుగా జిల్లాలో నిజాయతీగా, ఎన్ని ఒత్తిడిలు వచ్చినా ఎక్కడా రాజీ పడకుండా విధులు నిర్వర్తించారని అన్నారు. విద్యలో అనంతపురం జిల్లాను రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిపిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి అధికారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓట్ల నమోదుకు సహకరించలేదని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించడం బాధాకరమన్నారు. ఇది నిజాయతీ అధికారుల మనోధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అవుతుందన్నారు. డీఈవో బదిలీ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పూర్తి అయ్యేంత వరకు ఆయనను ప్రస్తుత స్థానంలోనే విధులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, యుటిఎఫ్ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఎస్‌టియు, యుటిఎఫ్ నాయకులు శివయ్య ఆచారి, బాబ్జి నాయక్, సుంకన్న, కిషోర్ సుబ్బరాయుడు, శివప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు



సవితమ్మ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న సిఐడి అధికారులు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఇంట్లో సిబిఐ దాడులు

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని వజ్రాలపేటలో ఉన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఇంట్లో సిబిఐ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కర్నాటకలో నమోదైన రైల్వే కేసు విషయంలో సవితమ్మను సిబిఐ అధికారులు విచారించారు. సవితమ్మ భర్త వెంకటేష్ రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. రైల్వే పనుల్లో అధికారుల అవినీతి పెచ్చుమీరిందని సిబిఐకి ఫిర్యాదులు అందాయి. అధికారుల అవినీతిపై వెంకటేష్ వద్ద సాక్ష్యాల కోసం సిబిఐ అధికారులు పెనుకొండలోని సవితమ్మ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సిబిఐ అధికారుల బృందం ఉదయం నుంచి దాదాపు 7 గంటల పాటు తనిఖీలు చేపట్టారు. సవితమ్మ ఇంట్లో రికార్డులు, ఇతర లావాదేవీలను అధికారులు పరిశీలించారు. దీనిపై మీడియా సిబిఐ అధికారులను వివరణ కోరగా వారు స్పందించలేదు. ఇది కేవలం రైల్వే కేసు మాత్రమే అని చెప్పారు. సవితమ్మ ఇంట్లో సిబిఐ దాడులు జరుగుతున్నాయన్న సమాచారం తెలుసుకున్న టిడిపి పెనుకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హిందూపురం మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. సిబిఐ దాడులను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. సిబిఐ అధికారులు ఎందుకు తనిఖీలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా టిడిపి కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో సవితమ్మ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రమేష్ సిబ్బందితో అక్కడికి చేరుకుని టిడిపి కార్యకర్తలను పంపించివేశారు. సిబిఐ అధికారులు తనిఖీలను పూర్తిచేసుకుని అక్కడినుండి వెళ్లిపోయారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

క్రిమిసంహారక మందు కేన్లతో నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఇంతలో ఇద్దరు మహిళా కాంట్రాక్టు కార్మికులు క్రిమి సంహారక మందు క్యాన్లతో తీసుకుని కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు రెండేళ్లుగా కమిషనర్ వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేతనాలు ఇస్తారా.. చావాలా.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నం చేశారు. అనంతరం సిఐటియు, ఎఐటియుసి నాయకులు నరసయ్య, వీరభద్రస్వామి మాట్లాడుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న ఆరుగురు కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. అయితే తమ ఉద్యమాలతో వారి వారసులను పనిలోకి తీసుకుని రెండేళ్లుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అదేవిధంగా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలోనూ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ బండి శేషన్న తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు కె.నరసయ్య, వీరభద్రస్వామి, ఈశ్వరయ్య, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు


'ఉపాధి'ని సమర్థవంతంగా అమలుచేయాలి

వ్య.కా.సం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

శింగనమల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల పరిధిలోని ఆనందరావుపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కొత్త నిబంధనలు తెస్తూ కూలీల కడుపు కొట్టేందుకు యత్నిస్తోందన్నారు. ముఖ్యంగా కూలీలపై ఒత్తిడి పెంచి ఉపాధి పనులే తమకొద్దనే విధంగా చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ నెంబర్ 17000(31)ని రద్దు చేయాలని, రెండు పూటలా పని రద్దు చేసి, సమ్మర్ అలవెన్స్‌ను కొనసాగించాలని, పాత పద్ధతిలో పనులు కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. వ్య.కా.సం మండల కార్యదర్శిగా సలకంచెరువు సుంకన్న, అధ్యక్షులు తరిమెల రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా నాగేంద్ర, రమేష్, ఉపాధ్యక్షులుగా చిన్నమట్లగుంది ఆంజనేయులు, అనంతరావుపేట ఆంజనేయులు, కోశాధికారిగా ఎర్రిస్వామిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, రామాంజనేయులు, ఆంజనేయులు బాలరాజు, శంకర, రమేష్, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, నాగేంద్ర పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం..

హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ దేశేనాయక్



అనంతపురం : రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరం మేరకు సాగునీరు అందిస్తున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ దేశేనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ గతనెల అధిక వర్షాల కారణంగా ఏర్పడిన విపత్తుతో అక్టోబర్ 21 నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతుల సూచనల మేరకు పది రోజులపాటు నీటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నవంబర్ 1వతేదీ నుంచి తిరిగి రైతుల సూచనల మేరకు అవసరం మేరకు ఆయా ప్రాంతాలకు తాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. అధిక వర్షాల కారణంగా పంటపొలాల్లో నీరు చేరడం వల్ల రైతులు నేరుగా తమ దృష్టికి తీసుకురావడంతో కొన్నిరోజులు నీటిపారుదలను ఆపినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులకు ప్రయోజనం చేకూడంతోపాటు విద్యుత్ బిల్లు రూ.35 కోట్లు ఆదా అయిందన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా మల్యాల నుంచి పంపింగ్ స్టేషన్ పిఎస్‌వన్ నుంచి 1685 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రికి జీడిపల్లి రిజర్వాయర్‌కు దాదాపుగా 1000 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని చెరువులు, డ్యాంలు నీటితో కళకళలాడుతున్నాయన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కణేకల్లు

ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన మండల కేంద్రంలో కారు డ్రైవర్ శిక్షావలి కుమారుడు మహమ్మద్‌హదిల్ కుటుంబానికి గౌసే సందాని హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ తరపున రూ.6వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కనేకల్ వైస్ సర్పంచి నబిసా, ముత్తవల్లి, మాజీ వార్డ్ మెంబర్ శర్మాస్ రఫిక్, ఖాజా పీరా, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడిపై చర్యకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-గుత్తి



తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా కోర్టు తీర్పును ధిక్కరిస్తున్న టిడిపి నాయకుడు దిల్కాశీనాపై అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని 615 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో అక్రమంగా బండలు పాతుతున్న దిల్కాశీనాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు సిపిఎం నాయకులు వేర్వేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 615లో ఉన్న ప్రభుత్వ భూమిలో 14 ఏళ్ల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో పేదల భూపోరాటం చేసి అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. టిడిపి నాయకుడు దిల్కాశీనా ఆ స్థలం తమదంటూ 68 మంది పేదలపై అక్రమ కేసులు బనాయించాడన్నారు. ఆ కేసు ఇటీవల జిల్లా కోర్టులో పేదలకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అలాగే దిల్కాశీనా పేదలకు రూ.10 వేలు చొప్పున పరిహారం అందించాలని తీర్పు వచ్చిందని వివరించారు. కోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ హైకోర్టుకు వెళ్ళామని చెబుతూ టిడిపి నాయకుడు ఆ స్థలంలో బండలు పాతుతున్నాడని వారన్నారు. ప్రజలపై దౌర్జన్యం చేయకుండా ఇబ్బంది కలిగించకుండా దిల్కాశీనాపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, కెపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా నాయకురాలు ఎం.కవిత తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజలు తపాలా శాఖ ప్రవేశపెట్టిన బ్యాంకింగ్, బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ బి.నరసప్ప కోరారు. శుక్రవారం రాయదుర్గంలోని తపాల శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలోని అన్నిసేవలు ఆన్‌లైన్ అయ్యాయన్నారు. తపాలా శాఖ ఖాతాలో జమ చేసిన ప్రతి ఆర్థిక లావాదేవీకి సంబంధించిన సమాచారం మొబైల్ నెంబర్‌కు వస్తుందన్నారు. ఎవరికైనా తమ సెల్‌కు సమాచారం రాకుంటే ఫోన్..94910 20022కు ఫిర్యాదు చేయాలన్నారు. గతనెల 31వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు తమ శాఖలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాయదుర్గంలోని తపాలా కార్యాలయంలో పోస్ట్‌మాస్టర్, పోస్ట్‌మెన్ పోస్టులు ఖాళీలు భర్తీ గా ఉన్న విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకురాగా పోస్టుమాస్టర్ పోస్టులకు ఇదివరకే రాత పరీక్షలు జరిగాయని త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. అలాగే కార్యాలయంలో ఇన్వర్టర్, జనరేటర్ లేకపోవడం వల్ల విద్యుత్ సరఫరా ఆగిపోయిన ప్రతిసారి ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతున్నాయని చెప్పగా త్వరలోనే ఇన్వర్టర్ సౌకర్యం కల్పిస్తామన్నారు. తపాలా శాఖ ఖాతాదారులకు కేవలం రూ.399 ప్రీమియం చెల్లింపుతో రూ.10లక్షల వరకు గ్రూప్ బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ రాయదుర్గం సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ అభినవ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ నేతలపై కక్షపూరిత ధోరణి సరికాదు..

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి బిసి నేతలపై కక్ష పూరిత ధోరణి సరైంది కాదని కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్లు కురుబ నారాయణస్వామి, రాగే యల్లప్ప ఖండించారు. శుక్రవారం స్థానిక 13వ డివిజన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి, టిడిపి బీసీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. నిన్న అయ్యన్నపాత్రుడు, కుమారుడిని అరెస్టు చేయడంతోపాటు నేడు పెనుగొండ బిసి మహిళా నాయకురాలు సవితమ్మ ఇళ్లపై ఎసిబి దాడులు చేయడం బాధాకరమన్నారు. బిసి నేతలపై నిందలు మోపి ఇబందులకు గురి చేస్తూ రాక్షసానందం పొందడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి కక్షసాధింపు చర్యలకు మానుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పెనికలపాటి శివ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు వీరానంద, కార్యదర్శి శంకర్, వేణు, అభి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని హౌసింగ్ డిఇ హనుమన్న కోరారు. శుక్రవారం విడపనకల్లు మండలం గడేకల్ గ్రామంలో పర్యటించిన ఆయన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణ పనుల్లో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వీలైనంత త్వరగా నిర్మించుకునే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం వైస్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి సచివాలయం తనిఖీ చేసి గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుశీలా ఉమాశంకర్, ఉపసర్పంచి పార్వతి, ఎంపిటిసి ఓబులేష్, గడేకల్ మాజీ సర్పంచులు కరణం భీమరెడ్డి, మేకల పంపాపతి, కడదర బెంచి సర్పంచి దేవరాజు, హౌసింగ్ ఎఇ అనిల్‌కుమార్, భీమేష్, సెక్రటరీ సోమయ్య, వైసిపి నాయకులు ఉమాశంకర్, హేమంత్, రాము పాల్గొన్నారు.

జనవరి నాటికి బ్రిడ్జి నిర్మాణం పుర్తి కావాలి

అనంతపురం : నగరంలోని టవర్‌క్లాక్ వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు జనవరి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక అధికారులతో కలిసి బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారి నుంచి బ్రిడ్జిపైకి వెళ్లి పనుల పురోగతిపై ఆరాతీశారు. వచ్చే ఏడాది జనవరి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నడిమివంక ప్రాంతాన్ని కూడా పరిశీలించి అక్కడ రహదారి పనులు చూశారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, అధికారులు పాల్గొన్నారు.

మాజీమంత్రి అయ్యన్నపాత్రుడి అరెస్టు అన్యాయం

నార్పల : మాజీమంత్రి అయ్యన్నపాత్రుడి అక్రమ అరెస్టుకి నిరసనగా ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి నాయకులు అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్లుగా జగన్ రాక్షస పాలన సాగుతోందన్నారు. ముఖ్యంగా టిడిపి బీసీ నాయకులను అక్రమ కేసులతో అరెస్టు చేసి అణగతొక్కడమే ధ్యేయంగా జగన్ పని చేస్తున్నాడని విమర్శించారు. అధికారంలోకి రాకముందు కల్లబొల్లి మాటలు చెప్పి బిసి ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ తన పాలనలోని తప్పులను ఎత్తిచూపుతున్న బీసీ నాయకులను అక్రమ కేసులతో అణగదొక్కడమే లక్ష్యంగా సిఐడి పోలీసులు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. అయ్యన్నపాత్రుడిని వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యదర్శి వెంకటేశ్వరనాయుడు, మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, రాఘవనాయుడు, తెలుగు యువత చంద్రబాబు, పిఎల్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లి కుళ్లాయప్ప, రంగాపురం రమేష్, నరేంద్ర, ప్రకాష్, నరసాపురం భక్త, కేసేపల్లి నాగేంద్ర, నడిమిపల్లి గంగాధర్ నాయుడు, పులసలనూతల కాటమయ్య, నడిమిదొడ్డి నాగార్జున, గొల్లపల్లి ధనుంజయ, గంగానాయుడు, తుంపెర నాగేష్, డీలర్ నాగేంద్ర, హరీష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-గార్లదిన్నె

ప్రజా సమస్యలు తెలుసుకోవడంతోపాటు పరిష్కరించేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కోటంక గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు సిపిఎం అనుబంధ సంఘాల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు వైసిపి, టిడిపిల పాలనపై విసుగు చెంది సిపిఎం అనుబంధ సంఘాల్లో చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో పోరాటాలు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, రాము, జగదీష్, శ్యామల, నాగార్జున, రవి, తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువల్లో పూడిక తీయించాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు



కమిషనర్ శేషన్నకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లోని మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురికి కాలువల్లో పూడిక ఉండడంతో వర్షాకాలంలో మురికి నీరు రోడ్లపైన ప్రవహిస్తోందన్నారు. తద్వారా దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, వెంకీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థను కాపాడాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం



రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్, యుటిఎఫ్, ఎస్‌టియు, జెవివి బలపరిచిన తనను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థను కావాడాలని పోతుల నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పింఛనర్లు, సచివాలయ ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న అధికార, ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు తమ అభ్యర్థులను గెలిపించాలని మొసలి కన్నీరు కారుస్తూ మీ ముందుకు వస్తున్నారన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తనను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పింఛనర్లు, సచివాలయ ఉద్యోగుల గొంతుకనై సమస్యలను నిలదీస్తానన్నారు. బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనారిటీ సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ విద్య, వైద్యం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కావున వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

7న క్రీడాకారుల ఎంపిక

నార్పల : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఈనెల 7, 8వ తేదీల్లో నియోజకవర్గంలో 17 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నాగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో రాలన్నారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి

డి.హీరేహాల్ : మండలంలోని గుడిసెలపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు, వైఎస్ ఎంపిపి భర్త బసవరాజు గురువారం బళ్లారి ఆసుపత్రిలో మృతిచెందడంతో విప్ కాపు రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో ఎంపిపి పవిత్ర హొనూరుస్వామి, వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సర్పంచులు రాళ్ల రామలక్ష్మమ్మ, బోయ మల్లికార్జున, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దోనప్ప, నాయకులు జగదీష్, రహంతుల్లా, నాగరాజు, సురేష్, రాళ్ల తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

దోమల నివారణపై అవగాహన

వజ్రకరూరు : మండల కేంద్రంలోని తట్రకల్ గ్రామంలో సర్పంచి ధనలక్ష్మి ఆధ్వర్యంలో దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మానాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, గ్రామ సచివాలయ ఎఎన్ఎం నీలమ్మ, తదితరులు ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై వివరించారు. ముఖ్యంగా నీటి నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున వారంలో ఒకరోజు నిల్వ ఉన్న నీటిని పారబోసి తొట్లను ఎండబెట్టాలన్నారు. అలాగే ప్రజలందరూ తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు. తర్వాత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన, చేతుల పరిశుభ్రత, రక్త హీనతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు రుద్రమ్మ, వీరభద్రమ్మ, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం

ఉరవకొండ : పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆర్డీటీ సంస్థ సహకారంతో ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోవోల్టేజ్ కారణంగా మోటార్ కాలిపోతే రెండు రోజులుగా నీరు రాకపోవడంతో సమస్య తలెత్తింది. విషయాన్ని ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా కమిటీ ఆర్డీటీ సంస్థ దృష్టికి తీసుకెళ్లగా సంస్థ ఛైర్మన్ తిప్పేస్వామి వెంటనే స్పందించి కొత్త మోటార్, మెటీరియల్‌ను అందజేశారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షులు నెరమెట్ల యల్లన్న, బండారు రామాంజనేయులు, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజేష్, సభ్యులు రామాంజనేయులు, రాయంపల్లి సోమశేఖర్, ముష్టూర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ ప్రమాదంలో గాయపడిన మరో మహిళ మృతి



మృతిచెందిన లక్ష్మి

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో బుధవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడిన మరో మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఇప్పటికూ నలుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీ (44) అనంతపురం ప్రభుత్వాసుపత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెం దినట్లు కుమారుడు హొన్నూరుస్వామి తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి.

రేషన్ బియ్యం పట్టివేత

రాప్తాడు : మండల కేంద్రం లోని 44వ జాతీయ రహదారిలో శుక్రవారం తనిఖీలు నిర్వహించగా హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళ్లే లారీలో 470 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారి ఐఅపి సాయిప్రసాద్, డిసిటిఓ విజయలక్ష్మి తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇటుకలపల్లి సిఐ మోహన్, రాప్తాడు సిఎస్‌డిటి జ్యోతి, ఆర్ఐ, విఆర్ఓ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

గుంతకల్లు : పట్టణంలోని హనుమాన్ కూడలిలో గురువారం రాత్రి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1వ పట్టణ ఎస్సై మురహరిబాబు రాత్రి సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తుండగా తాడిపత్రికి చెందిన నాగేంద్రబాబు మారుతి వాహనంలో రూ.66 వేలు విలువజేసే రూ.15వేల గుట్కా, టబాకో ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మూడు ట్రాక్టర్లకు జరిమానా

పుట్లూరు : మండలంలో ఇసుకను అధిక లోడుతో వెళ్తున్న మూడు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వశుక్రవారం పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి అధిక లోడుతో వెళ్తున్న మూడు ట్రాక్టర్లకు రూ3వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. మరొకసారి అధిక లోడుతో వెళ్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మూఢనమ్మకాలు నమ్మొద్దు.. : జెవివి

ఉరవకొండ : ఎవరూ మూఢనమ్మకాలను నమ్మవద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం విడపనకల్ మండలంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో నిత్య జీవితంలో మూఢనమ్మకాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిమా లేదు.. మహత్యం లేదని, నేటి సమాజంలో సైన్స్ లేనిదే మానవునికి మనుగడ లేదన్నారు. పేదరికం-నిరక్షరాస్యత వల్ల చాలామంది మూఢనమ్మకాలపై అడుగులు వేస్తున్నారన్నారు. ప్రశ్నే ప్రగతికి మార్గం అన్నారు. కావున విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిమిక్రీ కళాకారులు లింగమూర్తి, ప్రిన్సిపల్ గంగాధర్, అధ్యాపకులు శశికళ, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు

రాయదుర్గం : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రాయదుర్గం ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 6వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వతేదీ సాయంత్రం 6 గంటలకు రాయదుర్గం నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు బయలుదేరి మరుసటి రోజు సోమవారం ఉదయం 6 గంటలకు అరుణాచలం (తిరువన్నామలై) చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం రాయదుర్గం చేరుతుందన్నారు. ఒక్కొక్కరికి రానూపోనూ పెద్దలకు రూ.1400, పిల్లలకు (11 సంవత్సరాలలోపు వారికి) రూ.750గా టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా రాయదుర్గం నుంచి రోజూఉదయం 4:45 గంటలకు బయలుదేరే శ్రీశైలం బస్సు సర్వీసుకు అదనంగా రోజూ ఉదయం 8 గంటలకు మరో సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు.

పవన్‌కళ్యాణ్‌కు జెడ్ క్యాటగిరి భద్రత కేటాయించాలి

శింగనమల : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు జెడ్ కేటగిరి భద్రత కేటాయించాలని ఆ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి బొమ్మన పురుషోత్తంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 11 రోజులుగా పవన్‌కళ్యాణ్ ఇల్లు, పార్టీ కార్యాలయం చుట్టూ కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారన్నారు. అంతేగాకుండా మంగళవారం రాత్రి ఆయన ఇంటి వద్దకు వచ్చి గొడవ కూడా చేశారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నివారించబోగా బూతులు తిడుతూ పవన్‌కళ్యాణ్‌ని దుర్భాషలాడుతూ గొడవ చేశారు. సిబ్బందిని కవ్వించే రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇవన్నీ విశాఖపట్నం పట్టణ పర్యటన తర్వాతే జరుగుతున్నాయన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం కలగజేసుకుని పవన్‌కళ్యాణ్‌కు కేంద్ర బలగాలతో కూడిన భద్రత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గుంతకల్లు ఎస్డీపీవో పరిధిలోకి గుత్తి పోలీస్‌స్టేషన్

గుత్తి : గుంతకల్లు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి పరిధిలోకి గుత్తి పోలీస్‌స్టేషన్‌ను విలీనం చేసినట్లు సీఐ ఎం. వెంకటరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తాడిపత్రి పోలీస్ సబ్ డివిజనల్ అధికారి పరిధిలో ఉండేదన్నారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో ఇటీవల 150 జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో గుత్తి పోలీస్ స్టేషన్ విలీనం అయిందన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వినాయకుని ఆలయానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.51వేలు విరాళం ఇచ్చారు. ఈమేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. విరాళం ఇవ్వడం పట్ల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కెరీర్ అడ్వాన్స్‌మెంట్ ఇంటర్వ్యూలు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియులో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఎఎస్) కింద శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కోసం విసి జి.రంగజనార్ధన అధ్యక్షతన గవర్నర్ నామినీ, వివిధ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, వివిధ అనుభవజ్ఞులైన ఆచార్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ యం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, అకాడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, ఆర్.కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన డప్పు కళాకారులకు పింఛన్లు ఇవ్వాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

పెద్దవడుగూరు : అర్హులైన డప్పు కళాకారులకు ప్రభుత్వం వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గంగమ్మ గుడి వద్ద మండల అధ్యక్షులు పెద్దయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా దళితులు ఇంకా వెనుకబడి ఉండటం బాధాకరమన్నారు. ముఖ్యంగా దళిత కాలనీల్లో రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు లేవన్నారు. అలాగే అనేకమంది డప్పు కళాకారులు ఉన్నప్పటికీ పింఛన్లు మాత్రం కొందరికే ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన డప్పు కళాకారులందరికీ పింఛన్లతోపాటు డప్పు, డ్రెస్, గజ్జులు ఇవ్వాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శివకృష్ణ, మండల కార్యదర్శిగా పెద్దయ్య కోశాధికారిగా నరసమ్మ, ఉపాధ్యక్షులుగా నరసింహులు, నాగరాజు, సహాయ కార్యదర్శి చిన్న శ్రీరాములు, మండల కమిటీ సభ్యులుగా రామాంజినేయులు, ఇసక నారాయణ, అనంతగిరి, పుల్లన్న, శేఖర్, రామాంజినేయులును ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప